క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కంకిపాడు: మండలంలోని తెన్నేరు గ్రామ శివారు కోమటిగుంటలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఉదయం ఎనిమిది గంటల నుంచి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారని వివరించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండలంలోని పోరంకి సెక్షన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరులో ఓ యువతి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు అజయ్‌నగర్ కాలనీకి చెందిన దంపతులు తమ కుమార్తె, కుమారుడితో నివసిస్తున్నారు. వారి 18 ఏళ్ల కుమార్తె ఇంటర్ చదివి తల్లితో పాటు పోరంకిలో ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తోంది. తల్లి అనారోగ్యానికి గురవడంతో యువతి ఈ నెల 24వ తేదీన డ్యూటీకి వెళ్లింది. అయితే ఆమె తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు వస్త్రదుకాణం వద్దకు వెళ్లి అడగ్గా ఆ యువతిని ఓ వ్యక్తి బైక్ పై తీసుకెళ్లాడని యజమానులు చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోరంకిలో మునిసిపల్ కార్మికుల ధర్నా

పెనమలూరు: మండలంలోని తాడిగడప మునిసిపాలిటీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ పోరంకిలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్, రక్షణ పరికరాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఫ్, ఈఎస్ఐ, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు స్పందించి కార్మికులతో మాట్లాడారు. ఈ సమస్యలు 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఏబీవీపీ నేతలపై కేసు

పెనమలూరు: ఓ ప్రైవేటు కాలేజీపై ఏబీవీపీ నేతలు దాడి చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వి.శ్రీనివాసరావు కథనం మేరకు.. మండలంలోని పోరంకిలో ఉన్న ఓ ప్రైవేటు కాలేజీకి మంగళవారం ఏబీవీపీ నాయకులు వచ్చారు. గుర్తింపు లేకుండా కాలేజీ నడుపుతున్నారని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి హడావుడి సృష్టించారు. ఈ ఘటనపై కాలేజీ ప్రిన్సిపాల్ బాల కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

30న ముస్తాబాద ఉరుసు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న ముస్తఫావలి అవులియా 58వ ఉరుసు మహోత్సవం ఈ నెల 30వ తేదీ శనివారం రాత్రి ప్రారంభం అవుతుందని ముజావర్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు భక్తులు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బ్రిటిష్ దొరల దాస్య శృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కల్పించేందుకు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన విప్లవ ఉద్యమకారుడు భగత్‌సింగ్ అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో మానవత సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత మానవత సభ్యులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు కూర్లెళ్ల సుబ్బాచారి, సభ్యులు నారగాని కొండలరావు, పాట్లూరి శేషాచలం, వడ్డీ రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, చక్కా సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై కసరత్తు

- పెనమలూరు నియోజకవర్గంలో ఓటర్ల సమగ్ర సర్వే
- 81 పోలింగ్ కేంద్రాల మార్పు, కొత్తగా రెండు ఏర్పాటు
- ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్



ఓటర్ల సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ విజయ్‌కుమార్

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో కసరత్తు చేశామని ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్ తెలిపారు. సమగ్ర ఓటర్ల సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు రాకుండా చూసేందుకు 81 పోలింగ్ కేంద్రాలు మార్పు చేశామని వివరించారు. ఆయన బుధవారం పెనమలూరులో ఈ వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో కసరత్తు చేశామన్నారు. గతంలో 302 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 81 పోలింగ్ కేంద్రాల్లో మార్పులు చేశామని తెలిపారు. కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాలు (పీఎస్ 130,131)ను పెనమలూరు పల్లిపేట, అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేశామని వివరించారు. దీంతో పోలింగ్ కేంద్రాల సంఖ్య 304కు చేరిందని తెలిపారు. పెనమలూరు మండలంలో 166, కంకిపాడు మండలంలో 64, ఉయ్యూరు మండలంలో 74 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

పూర్తి స్థాయిలో ఓటర్ల సర్వే

నియోజకవర్గంలో ఓటర్ల సర్వే పూర్తిస్థాయిలో చేపట్టామని ఆర్డీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మొత్తం 2,78,185 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. కొత్తగా ఓట్ల చేర్పులకు 8,401 దరఖాస్తులు (ఫారం -6) అందాయని వివరించారు. మృతులు, డబ్లింగ్ ఓట్లు తొలగింపునకు 11,202 దరఖాస్తులు (ఫారం -7), చిరునామా, పేర్ల మార్పులకు 15,426 (ఫారం -8) చొప్పున అందాయని పేర్కొన్నారు.

ఒకటే డోర్ నంబర్‌లో ఓట్ల తనిఖీ

ఒకే డోర్ నంబర్‌లో ఓట్లు ఎక్కువగా ఉన్నాయని వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టామని ఆర్డీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మొత్తం 1,595 డోర్ నంబర్లపై ఫిర్యాదులు అందగా, వాటిలో 23,093 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. అయితే తమ విచారణలో అపార్టుమెంట్లకు ఒకే డోర్ నంబర్ ఉండటం, ఫ్లాట్‌లు చాలా ఉండటంతో ఈ సమస్య ఉత్పన్నమైనట్లు తేలిందని పేర్కొన్నారు. 23,093 ఓట్లలో ఇప్పటికే 9,865 ఓట్లను ఆమోదించామని, మిగితా ఓట్లు తనిఖీలో ఉన్నాయని తెలిపారు. ఓటర్ల జాబితా రూపొందించే విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ స్పష్టం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా అక్టోబర్ 27వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు ఓటర్ల చేర్పులు, మార్పులకు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన ప్రకటిస్తామని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కంకిపాడు జెడ్పీ విద్యార్థుల ఎంపిక



కంకిపాడు విద్యార్థులతో హెచ్‌ఎం సుధారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం తదితరులు

కంకిపాడు: రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు కంకిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం జి.బి.కె. సుధారాణి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 26న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో కె.సిహెచ్.సాహితీరమణ, కె.ధరణిశ్రీ, బేస్‌బాల్‌లో ఎం.కీర్తి, అండర్-17 బేస్‌బాల్‌లో ఎన్.రేచల్, ఎస్.దివ్యసాయి చంద్రిక, ఎస్.కీర్తి సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సుధారాణి తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మత్తి హరిగోపాల్, లకనం దుర్గాప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తేలప్రోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఉంగుటూరు: రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు తేలప్రోలులోని బీకేఎంఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 11మంది ఎంపికయ్యా రని హెచ్‌ఎం వేలూరి వెంకట ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులకు అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 26న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బేస్‌బాల్, సాఫ్ట్ బాల్ జూనియర్, సీనియర్ బాలికల విభాగంలో 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు సుబ్బారావును, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



అందుకున్న బహుమతులతో విద్యార్థులు, దాత దేదీప్య, ఉపాధ్యాయులు

కంకిపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని దాత దేదీప్య సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో కంకిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని పట్టణానికి చెందిన ఉమామహేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె, హైదరాబాద్ కార్పొరేటర్ దేదీప్య బుధవారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వసతులను వినియోగించుకుని, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.ఎస్.వి.ప్రసాద్, హెచ్‌ఎం జి.బి.కె.సుధారాణి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మద్దుల గోవిందరావు, పి.ఆంజనేయులు, వార్డు సభ్యులు వంకదారు చిట్టబ్బాయ్, జి.ఇంద్రాణి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు రామవరప్పాడు జెడ్పీ విద్యార్థులు



ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఆటలు, క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్ఏవీ తాయారు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 సంవత్సరాల బాల, బాలికల విభాగంలో త్రోబాల్‌లో యు.దీపిక, కబడ్డీలో భావన, వెంకటలక్ష్మి, టెన్నికాయిట్‌లో గీత, ఎ.కేశవ శ్రీరాం, లీలాకృష్ణ, యోగలో సంజన, సాయి, మహేష్ నాయుడు, మనోజ్, మణికంఠ, ఉదయ్, హైజంప్‌లో నందీష్ ఎంపికై నట్లు తెలిపారు. 17 సంవత్సరాల బాల బాలికల విభాగంలో త్రోబాల్‌లో భాగ్యశ్రీ , దివ్యనాగ ప్రియాంక, సంతోష్, టెన్నికాయిట్‌లో కావ్యశ్రీ , కబడ్డీలో వెంకటేష్, గాయత్రి, వాలీబాల్‌లో సంతోష్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, పుష్పరాణి, జగదీశ్వరి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆంథోని రాజు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

మహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మహానందీశ్వరుడు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి ప్రదోష కాలంలో ఆలయంలో ఉన్న శ్రీమహా నందీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జి.ఆర్.వి.సాగర్, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం



కోలవెన్ను గణేష్ నిమజ్జన ఊరేగింపు



దావాజిగూడెంలో గణనాథుడికి పుష్పార్చన

కంకిపాడు: గణేష్ నవరాత్రులు మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు బుధవారం వినాయక మందిరాలను సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలోని మండపాల సెంటరులో పూజలందుకున్న విఘ్నేశ్వరుడి ఊరేగింపు మహోత్సవం ఘనంగా జరిగింది. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు డప్పు వాయిద్యాలు, యువత జోరుతో ఉత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గణపతి నిమజ్జన వేడుకలు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నిమజ్జన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాయ్‌నగర్, గౌడపేట, కేసరపల్లిలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు ముగిశాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. కేసరపల్లి శివాలయం వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో గణపతి లడ్డు ప్రసాదాన్ని జాస్తి సాంబశివరావు రూ.8,500కు పాడుకున్నారు.

సీనియర్ జర్నలిస్ట్ శివరామకృష్ణారావు మృతి



శివరామకృష్ణారావు (ఫైల్)

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందన సీనియర్ జర్నలిస్టు తాడేపల్లి శివరామకృష్ణారావు(67) బుధవారం మృతి చెందారు. ఆయన కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రక్తపోటు, మధుమేహం, లంగ్స్‌కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతూ తెలంగాణ రాష్ట్రం వరంగల్ నగరంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆయన ఉదయం, వార్త, సాక్షి, ఆంధ్రప్రభ, విశాలాంధ్ర తదితర పత్రికలలో విజయవాడ, హైదరాబాద్, తిరుపతి కేంద్రాల్లో ఉపసంపాదకునిగా పనిచేశారు. ఆయన రాసిన పలు కవితలు, సీరియల్స్, నవలలు, కథలు, కథానికలు పలు దిన, మాసపత్రికలలో ప్రచురితం అయ్యాయి. సుమారు అయిదు దశాబ్దాలు పత్రికారంగంలో సేవలు అందించారు. పలు అకాడమీలకు సంబంధించి జాతీయ నాయకుల జీవితాలపై రాసిన రచనలకు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. వ్యక్తిత్వ వికాసం, గాంధేయం రచనలు శివరామకృష్ణకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ప్రకృతి, వ్యవసాయం, గ్రామీణ సంస్కృతులు సంప్రదాయాలపై పలు ప్రసంగాలు చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.మోహన్‌రెడ్డి



డిఎస్పీ పి.శ్రీకాంత్‌కు బొకే అందజేస్తున్న మోహన్‌రెడ్డి

గుడివాడరూరల్: రాష్ట్రంలో పోలీసుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన డైరెక్టర్ ఎన్.మోహన్‌రెడ్డి తెలిపారు. గుడివాడ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ పి.శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆత్యాధునిక వసతులతో నూతన పోలీస్ స్టేషన్‌ల భవన నిర్మాణాలు, పోలీస్ క్వార్టర్స్‌ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. గుడివాడలో డీఎస్పీ నూతన కార్యాలయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. రూరల్ సీఐ సొంత కార్యాలయ నిర్మాణానికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చొరవతో స్థలాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. భవన నిర్మాణం త్వరలోనే మొదలు పెడతారని తెలిపారు. పోలీసుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

దేశభక్తి నినాదాలతో మార్మోగిన జెడ్పీ పాఠశాల

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల బుధవారం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. మేరీ మట్టీ మేరా దేష్ కార్యక్రమంలో భాగంగా వరుసగా రెండో రోజు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలు, జన్మభూమి మట్టిని చేత పట్టుకుని దేశభక్తి నినాదాలు చేశారు. అనంతరం ఆ మట్టిని భారతమాత పాదాల వద్ద ఉంచి దేశం కోసం ప్రాణాలను ఆర్పించిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, మీరా సాహెబ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనమలూరులో అత్యధికంగా ఓటర్లు

తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య



రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య

పెనమలూరు: కృష్ణా జిల్లాలో పెనమలూరు నియోజకవర్గంలోనే అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆయా రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బుధవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ.. ఓట్లు నమోదుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటర్ల మార్పులకు కూడా దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. మృతి చెందిన వారి ఓట్లు, డబ్లింగ్ ఓట్లను సైతం గుర్తించామన్నారు. ఓకే ఇంటి నంబర్‌పై అధికంగా ఓట్లు ఉన్నాయని పలు ఫిర్యాదులు అందాయని తెలిపారు. తమ పరిశీలనలో అపార్టుమెంట్‌లకు ఒక డోర్ నంబర్ మాత్రమే ఉండి ఫ్లాట్‌లు ఎక్కువగా ఉండటంతోనే ఈ సమస్య వచ్చిందని వివరించారు. ఇటువంటి ఫిర్యాదుల పై బీఎల్‌ఓలతో మళ్లీ తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు ఓట్ల చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు గడువు ఉందని తెలిపారు. ఓటర్ల హెల్ప్‌లైన్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఉంది లేనిది చూసుకోవచ్చని పేర్కొన్నారు. జనవరి ఐదో తేదీ 2024 సంవత్సరం నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలోనే అత్యధిక ఓటర్లు

పెనమలూరునియోజకవర్గంలో జిల్లాలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ వెంకటశివయ్య తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,78,185 మంది ఉన్నారన్నారు. వారిలో పురుషులు 1,34,671 మంది, మహిళలు 1,43,512 మంది, ఇతరులు ఇద్దరు చొప్పున ఉన్నారని వివరించారు. నియోజకవర్గంలో మొత్తం 304 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

నున్నలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ ద్వారా అందజేస్తున్న వైద్య సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. నున్న గ్రామంలో బుధవారం సచివాలయం 2, 3 పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ప్రభుత్వ వైద్యురాలు విజయ రోగులకు బీపీ, షుగర్, గర్భిణులు, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. డి.బాలమ్మ అనే వ్యాధిగ్రస్తురాలు గత కొన్నేళ్లుగా కాలికి గాయం అయి తగ్గక పోవడంతో ఆమెకు డ్రెస్సింగ్ చేసి పుండు మానడం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్య సిబ్బందికి సూచనలు తెలియచేశారు. రెండు సచివాలయాల పరిధిలో వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయతో పాటు ఏఎస్ఎంలు లక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, ఆషా పాల్గొన్నారు. గతంలో ప్రజలు ఎలాంటి చిన్న వ్యాధులకైనా ప్రైవేటు వైద్యులను సంప్రదించాల్సి ఉండేది. అలాంటిది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట ప్రజలు నివాసం ఉండే ప్రాంతాలకు దగ్గర్లోని డాక్టర వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌కు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగుల వద్దకు డాక్టర్లు, వైద్య సిబ్బందితో వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన ప్రజల వద్దకే వైద్య సేవలు వచ్చాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



శేఖర్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, అధికారులు

కంకిపాడు: అంకితభావంతో పనిచేస్తే అధికారులకు ప్రజల మన్ననలు ఎల్లప్పుడూ ఉంటాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు క్లస్టర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చిట్టిపోతుల శేఖర్ ఇటీవల ఈఓపీఆర్డీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించి, వీడ్కోలు సభ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించే అధికారులను ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారన్నారు. అంకితభావంతో పని చేసి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.ప్రసాద్, ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్, సర్పంచ్ ఇ.శివనాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బి.సురేష్, బి.హెచ్.నాగిరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. దావులూరు, చలివేంద్రపాలెం గ్రామాల ఆధ్వర్యంలో దావులూరు పంచాయతీ కార్యాలయంలో శేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.శ్రీలక్ష్మి, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష



గొల్లనపల్లిలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరిగింది. ముస్తాబాద, పెద అవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీలకు చెందిన ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి దీర్ఘకాల రోగాలకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేశారు. ప్రతి కుటుంబం, ఆ కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయటం ద్వారా వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్యుల సహాయంతో మందులు అందజేస్తుందని ముస్తాబాద పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద్‌బాబు చెప్పారు. గొల్లనపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది పలు గృహాలు సందర్శించి పరీక్షలు చేశారు.